సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 21 । మే । 2024



తొలకరి రాకే ఆలస్యం

రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వారం రోజులుగా దుక్కులు దున్నుతూ పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.

- 8లో ▸



జాగ్రత్తలు తీసుకోవాలి

వస్తువులు కొనే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు రాజేశ్వర్ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.4 /27.4

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వివాదాస్పద భూమి పరిశీలన

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ తిర్మన్ చెరువు శిఖం భూమిని సోమవారం ఆర్డీవో రాజేంద్రకుమార్ పరిశీలించారు. సర్వేనంబర్ 438/ఊ లో 2 ఎకరాలు, 439లో ఎకరం 30 గుంటల భూమిని అడవి మామిడిపల్లికి చెందిన దత్తాద్రి, ప్రణీత్ అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపిస్తూ ఈ నెల 17న తహసీల్దార్ కార్యాలయం ఎదుట చిన్నాపూర్ గ్రామస్తులు ధర్నా చేశారు. దీంతో ఆర్డీవో రాజేంద్రకుమార్ ఇరిగేషన్ అధికారులను రప్పించి సదరు భూమిని పరిశీలించారు. 3 ఎకరాల 30 గుంటలకు సంబంధించి పట్టాపాస్ బుక్ ఉన్నందున ఈ విషయమై పక్కాగా సర్వే చేయిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. అప్పటి వరకు గ్రామస్తులు ఆ భూమి విషయమై ఎలాంటి చర్యలు చేపట్టొద్దన్నారు. తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఆస్పత్రిలో తనిఖీలు



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌లోని ఖిల్లా రోడ్‌లో ఉన్న షాహీన్ ఆస్పత్రిలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, ఇన్‌చార్జి గంగాధర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతో ఓ మహిళ వంధ్యత్వాని గురైంది. దీంతో అధికారులు ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. గత నెల 17న బాన్సువాడ మండలానికి చెందిన ఓ మహిళ డెలివరి కోసం షాహీన్ ఆస్పత్రికి వచ్చింది. నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతో ఆపరేషన్ వికటించి, గర్భాశయాన్ని తొలగించారు. ఆమెకు మళ్లీ రక్తస్రావం కాగా మరో ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు ఆమె జీవితంలో గర్భం దాల్చలేదని చెప్పారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు నివేదికను డీఎంహెచ్‌వోకు అందజేశామన్నారు.

హోటళ్లలో శుభ్రత పాటించాలి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని హోటళ్లలో శుభ్రతను పాటించాలని మున్సిపాలిటీ శానిటేషన్ అధికారులు నిర్వాహకులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న హోటళ్లలో సోమవారం తనిఖీలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ మకరందు, డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ ఆదేశాల మేరకు ఆయా జోన్‌లకు సంబంధించిన శానిటేషన్ ఎస్సైలు ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సైలు ప్రభుదాస్, నటరాజ్‌గౌడ్, ప్రశాంత్, సునీల్, శ్రీకాంత్, మహిపాల్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్ష

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో టీచర్ అర్హత పరీక్ష(టెట్) మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం జరిగిన పరీక్షకు 170 మందికి 98 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 170 మంది అభ్యర్థులకు 156 మంది పరీక్ష రాశారు.



ఇంటికో వేప చెట్టు

■ వనాన్ని తలపిస్తున్న నూత్‌పల్లి గ్రామం

ఇంటింటా చెట్టు.. ఊరంతా వనం.. అన్న సామేతకు అక్షరాల సరిపోతుంది నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి గ్రామం. ఎందుకంటే ఈ ఊరిలో ఇంటికో చెట్టు కనిపిస్తోంది. అందులో చల్లని నీడ, ఆరోగ్యానికి మేలు చేసే గాలి అందించే వేపచెట్టు ప్రతి ఇంటి ముందు ఉండడం విశేషం! గ్రామంలో 750 నివాస గృహాలుండగా, పన్నెండు వీధుల్లో ఎటు చూసినా పచ్చని చెట్లే దర్శనమిస్తున్నాయి. వేసవి కాలంలో పిల్లలు, పెద్దలు చెట్ల నీడన కాలక్షేపం చేస్తున్నారు. హరితహారంలో నాటిన ఈ చెట్లు పర్యావరణాన్ని కాపాడుతున్నాయి. ఈ చెట్లను సంరక్షిస్తున్న గ్రామస్తులు ఆదర్శంగా నిలుస్తున్నారు. – డొంకేశ్వర్(ఆర్మూర్)

ఎరువుల నిల్వల పరిశీలన



సిరికొండ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. మండల కేంద్రంతోపాటు తూంపల్లి, గడ్కోల్ సొసైటీల్లో ఎరువుల నిల్వలను డీఏవో సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు తమకు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలని, అధికంగా కొనుగోలు చేసి కృత్రిమ కొరత సృష్టించవద్దని కోరారు. అనంతరం తూంపల్లి సొసైటీలో జీలుగ విత్తనాల పంపిణీని పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఏవో వెంకటేష్, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ చట్టానికి తూట్లు!

- నగర కార్పొరేషన్‌లో కొందరు అధికారుల ఇష్టారాజ్యం
- అవుట్ సోర్సింగ్ పబ్లిక్ హెల్త్ వర్కర్లతో పన్నుల వసూళ్లు
- డిప్యూటీ కమిషనర్ వేధిస్తున్నట్లు బిల్ కలెక్టర్ల ఆరోపణలు
- వసూలైన రూ.50 లక్షల పన్నులు పక్కదారి పట్టించారు
- ఆడిటింగ్‌లో బయట పడిన అక్రమ వ్యవహారం
- గుట్టుచప్పుడు కాకుండా రికవరీ చేస్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు అధికారుల ఇష్టారాజ్యం నెలకొంది. మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని. నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మూడేళ్ల కిందట అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకుల అండదండలతో వక్రమార్గంలో అవుట్ సోర్సింగ్ విధానంలో 330 మందిని పబ్లిక్ హెల్త్ విభాగం పనుల కోసం నియామకం చేసుకున్నారు. ఇలా నియామకం అయినవారు రోడ్లు, నాలాల క్లీనింగ్, శానిటేషన్ పనులు చేయాల్సి ఉంటుంది. అయితే ఇందుకు విరుద్ధంగా వీళ్లలో ఎక్కువమందితో కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఆఫీస్ క్లర్కులుగా, మేయర్ వద్ద సబార్డినేట్లుగా, బిల్లుల వసూలు తదితర పనులు చేస్తున్నారు. అలాగే కారొబార్ ఉద్యోగులతోనూ పన్నుల వసూలు చేయిస్తున్నారు.



డిప్యూటీ కమిషనర్‌పై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బిల్ కలెక్టర్లు

అవుట్ సోర్సింగ్ ద్వారా నియామకమైన పబ్లిక్ హెల్త్ ఉద్యోగులతో ఇతర పనులు చేయించడం మున్సిపల్ చట్టానికి, నిబంధనలకు విరుద్ధం. అవుట్ సోర్సింగ్ వర్కర్లతో బిల్లులు వసూలు చేయకూడదనే సర్క్యులర్‌ను (68638/ఆర్‌డీఎంఏ/2024ఏవై) ఈ ఏడాది ఏప్రిల్ 10న ప్రభుత్వం జారీ చేసింది. ఇలా వసూలు చేయించడం మున్సిపల్ చట్టానికి విరుద్ధమని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. కాగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ద్వారా వచ్చినవారు ఎవరు, ఎక్కడ, ఏఏ పనులు చేస్తున్నారో, ప్రతిరోజూ వస్తున్నారో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో అని పలువురు విమర్శిస్తున్నారు.

■ తమను డిప్యూటీ కమిషనర్ బాగా వేధిస్తున్నట్లు నగర కార్పొరేషన్‌లోని రెగ్యులర్ బిల్ కలెక్టర్లు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు విధులకు వచ్చి రాత్రి 12 గంటల వరకు పని చేస్తున్నప్పటికీ టార్చర్ చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం బిల్ కలెక్టర్లు అదనపు కలెక్టర్ అంకిత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పన్నుల వసూళ్ల విషయంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలోనే రెండోస్థానంలో ఉన్నప్పటికీ ఇలా వేధించడం తగదని అంటున్నారు. నరేష్, లక్ష్మణ్ అనే బిల్ కలెక్టర్లు ఇటీవల పనిభారంతో రోడ్డుపై పడిపోయారు. రాత్రి సమయంలో రాజేందర్ అనే ఉద్యోగికి రోడ్డు ప్రమాదం జరిగి బెడ్ రెస్ట్‌లో ఉన్నాడు. ఇక 15–20 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు ప్రమోషన్లు సైతం లేవని బిల్ కలెక్టర్లు చెబుతున్నారు. డబ్బులు ఇచ్చిన ఇతర ఉద్యోగులకు మాత్రం ప్రమోషన్లు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సొంత అవసరాలకు వాడుకున్నారు..

పన్నుల వసూళ్లను ఇష్టం వచ్చినట్లు వసూలు చేయించిన నేపథ్యంలో.. కొందరు ఉద్యోగులు వసూలైన మొత్తాన్ని వెంటనే మున్సిపాలిటీ ఖాతాలో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకుంటున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో గతంలో రూ.50 లక్షలను సొంత వ్యాపారాలకు వాడుకున్న ఉద్యోగుల నిర్వాకం ఏడాది క్రితం ఆడిటింగ్‌లో బయటపడినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని బయటపెడితే పరువు పోతుందని భావించిన అధికారులు సదరు మొత్తాన్ని విడతలవారీగా రికవరీ చేస్తున్నట్లు సమాచారం.

సీబీసీఐడీ విచారణ చేయాలి

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమంగా అవుట్ సోర్సింగ్ నియామకాలు, వారికి అప్పగించిన పనుల విషయమై విచారణ చేయాలి. పన్నుల వసూళ్లలో చోటుచేసుకున్న అక్రమాలపై సీబీసీఐడీ విచారణ చేసి నిజాలు నిగ్గుతేల్చాలి. మున్సిపల్ చట్టానికి విరుద్ధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో బిల్లులు వసూలు చేస్తున్న విషయమై ప్రత్యేకంగా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. గతంలో పనిచేసిన, ప్రస్తుత మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోకుండా చూసీచూడనట్లు వ్యవహరించిన తీరుపైన కూడా ప్రభుత్వం విచారణ చేయాలి.
– సయ్యద్ ఖైసర్, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్

పసుపు @ 4.37 లక్షల క్వింటాళ్లు

- గత సీజన్ కంటే లక్షన్నర క్వింటాళ్లు తగ్గిన కొనుగోళ్లు
- మార్కెట్ చరిత్రలోనే అధిక ధర

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ సీజన్‌లో 4.37 లక్షల క్వింటాళ్ల పసుపు క్రయవిక్రయాలు జరిగాయి. గత సీజన్ కంటే సుమారు లక్షన్నర క్వింటాళ్ల పంట మార్కెట్‌కు తక్కువగా వచ్చింది. మార్కెట్ చరిత్రలోనే పసుపునకు ఈసారి అధిక ధర వచ్చింది. 2011లో క్వింటాల్‌కు రూ.16,160 ధర రాగా ఈ సీజన్‌లో రూ.18వేల పైచిలుకు పలికింది. సీజన్‌లో పసుపు దిగుబడులతోపాటు మంచి ధర రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం తగ్గుతోంది. జాతీయంగా సాగు విస్తీర్ణం పెరిగినా.. మన మార్కెట్ పరిధి ప్రాంతాల్లో తగ్గింది. గతంలో ధర లేకపోవడం, వ్యయప్రయాసాలతో పంట పండించడం, కూలీ ధరలు పెరగడం, కూలీల కొరత లాంటి కారణాలతో జిల్లాలో రైతులు పసుపు సాగు చేయడానికి ఆసక్తి చూప లేదు. ఈ క్రమంలో అంతర్జాతీయంగా డిమాండ్ రావడంతో ధర అమాంతంగా పెరిగింది. అయితే ఈ ఏడాది మంచి ధర రావడంతో పసుపు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

రూ.18 వేల పైచిలుకు ధర

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు చరిత్రలో ఈసారి పసుపు క్వింటాలుకు అత్యధికంగా రూ.18,500 వరకు ధర పలికింది. మార్కెట్ చరిత్రలో 2011 సంవత్సరంలో క్వింటాల్‌కు రూ.16,160 ధర పలకగా, ఈసారి మోడల్ ధరనే అంతకు మించి వచ్చింది. ఈ సీజన్‌లోనే రూ.20 వేలు ధర పలుకుతుందని రైతులు, అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఈసారి మోడల్ ధర రూ.16,500 పలికింది. ప్రతియేటా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పసుపు క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. జిల్లాతోపాటు జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, మహారాష్ట్ర నుంచి పసుపును మార్కెట్‌కు తీసుకొస్తారు. కానీ ఈసారి మహారాష్ట్ర నుంచి పసుపును నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకురాలేదు. దీనికితోడు నిజామాబాద్ మార్కెట్‌యార్డు పరిధికి తీసుకొచ్చే ప్రాంతాల్లో పంట విస్తీర్ణం భారీగా తగ్గింది. దీంతో మంచి ధర వచ్చిందని రైతులు అంటున్నారు.



మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన పసుపు పంట (ఫైల్)

మార్కెట్‌కు వచ్చిన పసుపు వివరాలు

సంవత్సరం	వచ్చిన పసుపు (క్వింటాళ్లు)	మోడల్ ధర
2021-22	7,60,543	రూ.6,925
2022-23	6,38,924	రూ.6,787
2023-24	5,74,72	రూ.5,777
2024-25	4,37,433	రూ.16,500

రైతులకు మంచి ధర

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు పంటను తీసుకొచ్చిన రైతులందరికీ ఆశించిన దాని కంటే మంచి ధర లభించింది. మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. రేటు వచ్చిందని అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే.. ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. – వెంకటేశం, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, నిజామాబాద్ మార్కెట్

వినియోగదారులు చైతన్యం కావాలి

- వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అన్నిరకాల వస్తువులను బహిరంగ మార్కెట్లోనే కొనాల్సిన ఆవశ్యకత నేపథ్యంలో వినియోగదారులు మరింత చైతన్యం కావాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. సోమవారం ఇందూరు వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ వీక్లీ బజార్ మార్కెట్‌లో లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011 గురించి అవగాహన కల్పించారు. ఈ నెల 20 నుంచి జూన్ 3 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సాంబరాజు చక్రపాణి మాట్లాడారు. తూనికలు, కొలతల శాఖ కూరగాయలు, చేపల మార్కెట్లలో తనిఖీలకు మాత్రమే పరిమితం కాదన్నారు. లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం.. మార్కెట్లో లభించే ప్రతి వస్తువుపై పూర్తి సమాచారం వినియోగదారులకు అర్థమయ్యే భాషలో ఉండేలా తనిఖీలు నిర్వహించే బాధ్యత తూనికలు, కొలతల శాఖదేనన్నారు. వినియోగదారులు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతల శాఖ) దేననని పేర్కొన్నారు. బంగారు ఆభరణాల వర్తకులు ఇచ్చిన బిల్లులో నాణ్యతకు సంబంధించిన వివరాలు లేకపోతే రూ.25,000 జరిమానా విధించే అధికారం లీగల్ మెట్రాలజీ శాఖకు ఉందన్నారు. ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్ మాట్లాడుతూ.. జిల్లాలో అమ్ముతున్న వంటనూనెల ప్యాకింగ్‌లు నిబంధనలకు విరుద్ధంగా, వినియోగదారులను మోసగించే విధంగా ఉన్నాయన్నారు. బంగారు, వెండి ఆభరణాల అమ్మకందార్లు పక్కా రశీదులు ఇవ్వడం లేదన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ ఆధ్వర్యంలో తూనికలు, కొలతలు, లీగల్ మెట్రాలజీ రూల్స్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.



తూనికలు, కొలతలు నిబంధనలపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న వినియోగదారుల సంక్షేమ సంఘం సభ్యులు


ఉచిత ఇసుక.. వ్యాపారులకే వరం

- ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా తరలించేందుకు అనుమతిచ్చిన ప్రభుత్వం
- ఇంటి యజమాని పేరిట పర్మిట్లతో సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

మోర్తాడ్: ఇళ్లు నిర్మించుకునే వారికి ఆర్థిక భారం తగ్గించడానికి ఉచితంగా ఇసుకను తరలించుకోవడానికి ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు వ్యాపారులకు వరంగా మారింది. కొందరు ఈ విధానాన్ని అనుకూలంగా మార్చుకుని జేబులు నింపుకుంటున్నారు. జిల్లాలో 17 పాయింట్ల నుంచి ఇసుకను ఎక్కడికైనా తరలించుకోవడానికి ప్రభుత్వం మార్చి 31న ఉత్తర్వులను జారీ చేసింది. గతంలో ఇసుక తరలించడానికి ట్రాక్టర్‌కు రూ.900ను సీనరేజ్ చార్జీలు వసూలు చేసేవారు. సీనరేజ్ చెల్లించకుండా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేసి భారీ మొత్తంలో జరిమానాలను వసూలు చేశారు. సామాన్యులు తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలంటే ఇసుక కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని గుర్తించిన ప్రభుత్వం ఉచిత విధానం అమలులోకి తీసుకవచ్చింది.

ఏం చేస్తున్నారంటే..

ఇళ్లను నిర్మించుకునేవారి పేరిట సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా వ్యాపారులు అనుమతి లేఖను తీసుకుంటున్నారు. ఇంజినీర్‌లతో ఒక ఇంటికి ఎన్ని ట్రిప్పుల ఇసుక అవసరం అవుతుందో ధృవీకరణ పత్రం తీసుకుని రెవెన్యూ అధికారుల ద్వారా వే బిల్లులు పొందుతున్నారు. వాస్తవానికి ఇంటిని నిర్మించుకునేవారు పంచాయతీ కార్యదర్శి అనుమతి పత్రం తీసుకుని ఏ ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలించుకుంటారో ఆ వాహనాన్ని రెవెన్యూ అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేయించిన ట్రాక్టర్ ద్వారానే ఇసుకను తరలించడానికి అనుమతి ఇస్తారు. వ్యాపారులు ఇళ్ల యజమానుల పేర్లపై పంచాయతీ కార్యదర్శి నుంచి అనుమతి తీసుకుని తమ దందా చేసుకోవడానికి ముడుపులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

వారిదే హవా..

భీమ్‌గల్ మండలం గోనుగొప్పుల, వేల్పూర్ మండలంలోని కోమన్‌పల్లి, వెంకటాపూర్, వేల్పూర్, మోర్తాడ్ మండలంలోని సుంకెట్, ధర్మోరా(పాలెం), శెట్‌పల్లి, బోధన్ మండలం పెగడపల్లి, నవీపేట్ మండలం లింగాపూర్, సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్, కొండూర్, తాళ్లరామడుగు, చిన్నవాల్గోట్, గడ్కోల్, జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్, డిచ్‌పల్లి మండలం సుద్దులం, ఏర్గట్ల మండలం తొర్తిల నుంచి ఇసుకను తరలించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పాయింట్లలో వ్యాపారులే పెత్తనం చెలాయిస్తున్నారు. ఇల్లు కట్టుకునే వారు ఇసుక కోసం దరఖాస్తు చేసుకుంటే వారి మాట చెల్లుబాటు కాకుండా చేస్తున్నారు. ఇసుక తరలించడానికి ప్రభుత్వం రూ.900 చెల్లించాలనే నిబంధన తొలగించింది. ఇసుక ఉచితం కావడంతో మార్కెట్‌లో ధర తగ్గాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా పరిస్థితి తయారైంది. ట్రిప్పును రూ.5వేల నుంచి రూ.6,500 వరకు విక్రయిస్తున్నారు.

విచారణ జరుపుతాం

ఇసుకను ఉచితంగా తరలించడానికి ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. వ్యాపారులే వాగులపై పెత్తనం చేస్తున్న విషయంపై విచారణ జరుపుతాం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలకు మేలు చేసేదే. ఉచిత ఇసుక పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు లాభం జరిగేలా చూస్తాం. – రాజుగౌడ్, ఆర్‌డీవో, ఆర్మూర్

సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి



మోపాల్: రాష్ట్రంలోని రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి తెలిపారు. జిల్లాలో 22వేల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ ఉందని వివరించారు. సోమవారం మోపాల్ సొసైటీని ఆయన పరిశీలించారు. ఇఫ్కో జాతీయ డైరెక్టర్‌గా ఎన్నికైన గంగారెడ్డిని మోపాల్, బాడ్సి సొసైటీ చైర్మన్లు గ్యానాజి గంగారెడ్డి, నిమ్మల మోహన్‌రెడ్డి సన్మానించారు. అదేవిధంగా మోపాల్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన గ్యానాజి గంగారెడ్డిని మార గంగారెడ్డి సత్కరించారు. రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, శనగలు, జొన్నలు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. సొసైటీ చైర్మన్లు కూడా వారికి సరిపోయే ఎరువులు తీసుకుని గోదాముల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు. ఎల్లోల సాయిరెడ్డి, డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, తిరుపతి, సీఈవో సాయిచంద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రంలోని స్టేట్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఉచిత ఫొటో, వీడియోగ్రఫీ, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు శిక్షణ పొందేందుకు అర్హులని, శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఫొటో, వీడియోగ్రఫీ శిక్షణ ఈ నెల 24 నుంచి, ఎలక్ట్రీషియన్ కోర్సు శిక్షణ 27వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

26న గ్రూప్స్ గ్రాండ్ టెస్ట్



తెయూ(డిచ్‌పల్లి): గోల్కొండ అకాడమీ సౌజన్యంతో తెలంగాణ యూనివర్సిటీ గిరిజన శక్తి విద్యార్థి సంఘం, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఈనెల 26న గ్రూప్–1, 2 గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహించనున్నారు. గ్రాండ్ టెస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను తెయూ రిజిస్ట్రార్ యాదగిరి విద్యార్థి సంఘం నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్సిటీ గిరిజనశక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీనురాథోడ్, నాయకులు సాగర్ నాయక్, రాజేందర్, శ్రీనివాస్ నాయక్, నరేశ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పరీక్షల అధికారుల సమావేశం

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (ఖిల్లా) లో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సంబంధిత అధికారులు తప్పకుండా పాల్గొనాలని ఆదేశించారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 38 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

పరిహారం అందించాలని వినతి



రెంజల్(బోధన్): రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన తమకు పరిహారం వెంటనే అందించే ఏర్పాట్లు చేయాలని మండలంలోని బోర్గాం గ్రామస్తులు ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌తో మొరపెట్టుకున్నారు. సోమవారం బాధిత రైతులతో ఆర్డీవో సమావేశమైన ఆయన ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందని తెలిపారు. భూముల సర్వే నంబర్లతోపాటు పట్టా ఒకరి పేరున ఉండగా మరొకరు కబ్జాలో ఉన్నారని వాటిని సవరించిన తర్వాత అందిస్తామని ఆర్డీవో సూచించారు. భూములు నష్టపోయిన రైతులకు మంజూరైన పరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. బోధన్ నుంచి భైంసా వరకు నేషనల్ హైవే పనులు కొనసాగుతుండగా, కొందరు రైతులకు పరిహారం అందించగా మరి కొందరు రైతులకు అందాల్సిన సొమ్మును తప్పొప్పుల కారణంగా నిలిపివేశారు. దీంతో రైతులు అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. ఆర్డీవో వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

తొలకరి రాకే ఆలస్యం..

- పనుల్లో నిమగ్నమవుతున్న రైతులు
- ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో 92 వేల ఎకరాల్లో పంటల సాగు



దుక్కి దున్ని సిద్ధంగా ఉంచిన భూమి

నందిపేట్(ఆర్మూర్): రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధమవుతున్నారు. తొలకరి రాకే ఆలస్యమంటున్న రైతులు సాగు ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. గత వారం రోజులుగా దుక్కులు దున్నుతున్నారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకుంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆర్మూర్ నియోజకవర్గంలో సుమారు 92 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల అవసరాలపై వ్యవసాయాధికారులు నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు. సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు భూసారం పెంచేందుకు భూముల్లో ఎరువు, నల్లమట్టిని పోసుకుంటున్నారు. నియోజకవర్గ రైతులు ప్రధానంగా చెరువులు, కుంటలు, ఎత్తిపోతల ఆధారంగా పంటలు సాగు చేస్తారు. నందిపేట మండలంలో 11, ఆర్మూర్ మండలంలో 3 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి పరిధిలోనే సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. కాలం అనుకూలంగా ఉండి ఎస్సారెస్పీ పూర్తిగా నిండితే ఆశించిన స్థాయి పంటలు సాగవుతాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి భూగర్భ జలాలుపైకి వస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగవుతాయి.

ఆర్మూర్ డివిజన్‌లో పంట సాగు వివరాలు (ఎకరాల్లో..)	
వరి	71,676
సోయాబీన్	8645
పసుపు	5260
మొక్కజొన్న	6500
కూరగాయలు	650
ఇతర పంటలు	1200

భూమిని సిద్ధం చేశాం



ఖరీఫ్ పనులు ప్రారంభం కాకముందే ముందస్తుగా ఎరువులను తీసుకున్నాం. సోయా సాగు చేసేందుకు దుక్కి దున్ని భూమిని చదును చేసి ఉంచాం. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేశాం.

– చిన్నారెడ్డి, రైతు, నందిపేట్

నివేదికలు పంపించాం

రబీ ముగియడంతో రైతులు రానున్న ఖరీఫ్ సీజన్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మేము క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ఏ నేలలో ఏ పంటలు వేయాలో సలహాలు ఇస్తున్నాం. అవసరమైన విత్తనాలు, ఎరువులకు సంబంధించి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులు పంపించాం. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– విజయలక్ష్మి, ఏడీఏ

ఫైన్ ఎగ్గొట్టేందుకు మాస్క్



కరోనా వైరస్‌కు చిక్కకుండా వాడిన మాస్కులు ఇప్పుడు పోలీసులకు చిక్కకుండా పనికొస్తున్నాయని నిరూపిస్తున్నారు పలువురు వాహనదారులు. నిబంధనలను అతిక్రమించే వాహనదారులకు ఆన్‌లైన్‌లో పోలీసులు ఫైన్‌లు వేస్తున్న విషయం తెలిసిందే. అయితే, తమ వాహనాల నంబర్లు పోలీసుల కెమెరాకు చిక్కకుండా నంబర్ ప్లేట్లపై మాస్కులు పెడుతున్నారు. మరికొందరు ఏకంగా ప్లేట్లపై నంబర్‌లకు బదులు కొటేషన్లు రాయించిన చిత్రాలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్







వస్తువుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్

నిజామాబాద్‌నాగారం: వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా అధ్యక్షుడు మాయావర్ రాజేశ్వర్ సూచించారు. నగరంలోని పాత గంజ్‌లో లీగల్ మెట్రాలజీ తూనికల కొలతల దినోత్సవాన్ని అసిస్టెంట్ కంట్రోలర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. వస్తువులపై ఐఎస్ఐ, ఆగ్‌మార్క్ చూసి కొనుగోలు చేయాలని, రసీదు తప్పకుండా తీసుకోవాలన్నారు. బిల్లు ఉంటే వినియోగదారుల కోర్టులో కేసు వేసే వీలుంటుందని పేర్కొన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తే జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులకు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రానికి వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సుజాత, అలీ, టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్‌రావు, నరేశ్, సుస్మిత్, వినియోగదారులు పాల్గొన్నారు.

'చెట్లను బరాబర్ నరుకుతా..!'

- జరిమానా వేస్తే చెల్లిస్తా
- పల్లె ప్రకృతి వనంలో 30 చెట్లు నరికిన సంతోష్‌నగర్ తండావాసి

బాన్సువాడ రూరల్: పట్టణాల్లోనే కాదు పల్లెల్లోనూ పార్కులు ఉండాలనే ఉద్దేశంతో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. నీడనిచ్చే మొక్కలతో పాటు రకరకాల పూలు, పండ్లు అందించే అందమైన మొక్కలను నాటి మూడేళ్లుగా సంరక్షిస్తున్న విషయం అందరికి తెలిసిందే. కాగా కొత్తాబాది జీపీ పరిధిలోని సంతోష్‌నగర్ తండా పల్లెప్రకృతి వనంలో ఉన్న చెట్లను అదే తండాకు చెందిన చందర్ అనే వ్యక్తి ఈనెల 10న 30కి పైగా చెట్లను నరికి వేశాడు. చెట్లను నరికివేస్తున్న విషయం తెలిసి పంచాయితీ కార్యదర్శి గణేష్ సూచన మేరకు కారోబార్ వెళ్లి నరికివేతను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో చందర్ చెట్ల నరికివేత ఆపేదిలేదని దిక్కున్న చోట చెప్పుకోమంటూ హెచ్చరించడంతో వెనుదిరిగాడు. అదేరోజు పంచాయితీ కార్యదర్శి, నిందితుడు చందర్‌కు నోటీసు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదు. తానే చెట్లను నరికానని ఏదైనా జరిమానా విధిస్తే చెల్లిస్తానంటూ పంచాయితీ కార్యదర్శి ఎదుట ఒప్పుకున్నాడు. దీంతో ఉన్నతాధికారుల సూచన మేరకు సోమవారం కొత్తాబాది పంచాయితీ కార్యదర్శి బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్నామని నిందితుడిని విచారించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు.



నరికివేతకు గురైన చెట్లను పరిశీలిస్తున్న సీఐ

సీపీ కార్యాలయానికి ఎస్సై అటాచ్!

నిజామాబాద్ క్రైం: ఓ మహిళ ఫిర్యాదు మేరకు నగరంలోని నాల్గోటౌన్ ఎస్‌హెచ్‌వో సంజీవ్‌ను సీపీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు సమాచారం. గతంలో సదరు మహిళ సీపీ కార్యాలయం వద్ద హంగామా చేయగా.. కేసు నమోదైంది. మహిళకు సంబంధించిన కేసు విషయంలో అటాచ్ ప్రతిపాదన ఉన్నతాధికారుల చెంతకు వెళ్లినట్లు సమాచారం. అయితే, ఎస్సైని సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు అందలేదని డిపార్ట్‌మెంట్ వర్గాల ద్వారా తెలిసింది.

కొనసాగుతున్న వాలీబాల్ సమ్మర్‌క్యాంపు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం వాలీబాల్ సమ్మర్ క్యాంపు కొనసాగింది. విద్యార్థులు, యువకులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళలలో మైదానంలోకి వచ్చి వాలీబాల్ ఆడుతున్నారు. ఈసందర్భంగా పీఈటీ బాలు మాట్లాడుతూ.. యువకులు సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడడం వల్ల మానసిక వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. సమ్మర్ క్యాంపు ఈనెల 31 వరకు కొన సాగుతుందన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



లక్ష్మణ్(ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మెంచు లక్ష్మణ్(31) మృతి చెందాడు. ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన లక్ష్మణ్ తన స్నేహితుడు సునీల్‌తో కలిసి బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఇంజిన్‌కు ట్రాలీకి మధ్య బైక్ ఇరుక్కోవడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు కారులో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా లక్ష్మణ్ మార్గమధ్యంలో మృతిచెందాడు. సునీల్ పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయిలో కాకులగుట్ట వాసి..

మాచారెడ్డి: బతుకు దెరువు కోసం దుబాయికి వెళ్లిన ఓ యువకుడు ఆదివారం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కాకులగుట్ట వాసులు తెలిపారు. తండాకు చెందిన భూక్యా భాస్కర్(25) ఏడాదిన్నర క్రితం దుబాయికి వెళ్లాడు. డ్యూటీలో భాగంగా బస్సులో వెళ్తుండగా ప్రమాద వశాత్తు బస్సు ఓ లోయలో పడిపోయి తలకు గాయాలై భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. భాస్కర్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. భాస్కర్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని తండావాసుల కోరుతున్నారు.



భాస్కర్ (ఫైల్)

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

దోమకొండ: మండలంలోని లింగపల్లికి చెందిన గుర్రపు వెంకటి(50) ప్రమాదవశాత్తు దోమకొండలోని గుండ్లచెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ సోమవారం తెలిపారు. మృతుడు వెంకటి తన కుమారుడు నరేందర్ తో కలిసి బట్టలు ఉతికేందుకు గ్రామ శివారులోని దోమకొండ గుండ్ల చెరువుకు వెళ్లాడు. బట్టలు ఉతుకుతున్న సమయంలో ప్రమాదవశాత్తు వెంకటి కాలుజారి నీటిలో పడిపోయాడు. కుమారుడు నరేందర్ అతడిని చెరువులో నుంచి బయటికి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. అయితే, వెంకటి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూర్ఛతో యువకుడు..



సాయికుమార్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్పూర్ గ్రామానికిచెందిన ముత్యాల సాయికుమార్(20) మూర్ఛ వ్యాధితో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాయికుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గత నాలుగైదు రోజులపాటు ఇసుక తరలించే పనికి వెళ్లాడు. సోమవారం స్నేహితుడితో కలిసి మద్యం సేవిస్తుండగా సాయికుమార్ కాళ్లు, చేతులు కొట్టుకుంటూ పడిపోయాడు. వెంటనే అతడి స్నేహితుడు మరో వ్యక్తిని పిలిపించి సాయికుమార్ తల్లికి సమాచారం ఇచ్చారు. ఆటోలో ఇంటికి తీసుకెళ్లి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చేలోపే సాయికుమార్ మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లగా, తల్లి గంగామణి బీడీ కార్మికురాలు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గంగామణి, శ్రీనివాస్ దంపతుల కుమార్తె గతంలో మృతి చెందగా, ఇప్పుడు కుమారుడు మృతి చెందడంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నలుగురికి జైలు

- ఒకరికి 15 రోజులు.. మరొకరికి 20 రోజులు

ఖలీల్‌వాడి/డిచ్‌పల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన పలువురికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 31 మందికి జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం సోమవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. 29 మందికి రూ.40,500 జరిమానా విధించిన న్యాయమూర్తి, ఒకరికి 20 రోజులు, మరొకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారని వివరించారు.

డిచ్‌పల్లి పీఎస్ పరిధిలో..

డిచ్‌పల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఒకరికి న్యాయమూర్తి 15రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తిని సోమవారం నిజామాబాద్ జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎం అలీ సిరాజ్ ఎదుట హాజరుపర్చగా జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

కామారెడ్డి పీఎస్ పరిధిలో..

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా, ఓ వ్యక్తి మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని, అతడిని సోమవారం కోర్టులో హాజరుపర్చామన్నారు. ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ సదరు వ్యక్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య



దొడ్డి అరుణ్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మద్యం మత్తులో ఉన్న వ్యక్తి మండలంలోని కాటేపల్లి గ్రామ శివారులో మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తన భార్య తాతయ్య చనిపోవడంతో కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా పెద్ద కరంజీ గ్రామానికి చెందిన నడిమి దొడ్డి అరుణ్(35) ఈ నెల 13న కాటేపల్లికి వచ్చాడు. అంత్యక్రియల అనంతరం అరుణ్ ఒక్కడే తన స్వగ్రామానికి వెళ్లి, తిరిగి 17వ తేదీన కాటేపల్లికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అరుణ్ ఆదివారం కరంజీకి వెళ్దామని తన భార్య సాగరికతో అనగా, కార్యక్రమాలు పూర్తయిన తరువాత వెళ్దామని ఆమె సమాధానమిచ్చింది. ఆ తరువాత బయటికి వెళ్తున్నాని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన అరుణ్ తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలుచోట్లు వెతుకగా గ్రామశివారులోని వ్యవసాయక్షేత్రంలో ఉన్న మామిడి చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి సోఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

సాలంపాడ్‌కు చెందిన వ్యక్తి..

బోధన్‌రూరల్: సాలూర మండలం సాలంపాడ్ గ్రామానికి చెందిన కుర్మ చిన్నగొండ(49) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన చిన్నగొండ భార్య, పిల్లలతో గొడవపడుతూ వేధిస్తున్నాడు. దీంతో అతడి భార్య ఇటీవల తన పుట్టింటికి వెళ్లిపోయింది. చిన్నగొండ ఆదివారం రాత్రి పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కామారెడ్డి టౌన్: మండలంలోని క్యాసంపల్లి గ్రామ శివారులో సోమవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. తోట రాజుకు చెందిన గేదె మేతకు వెళ్లి అక్కడే తెగిపడి ఉన్న విద్యుత్‌తీగలకు తగలి మృతి చెందింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రాజు కోరాడు.

రైలు ఢీకొని గాయాలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకున్న ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన యువకుడు కుడికాలిని కోల్పోయాడు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లా పిరంజీ గ్రామానికి చెందిన ధవానే ఆశిష్(23) గుర్తు తెలియని రైలు ఢీకొని గాయపడ్డాడు. మూడో నంబర్ ప్లాట్ ఫారంపై పడి ఉన్న ఆశిష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆశిష్ కుడికాలిని కోల్పోయాడు.

బ్యాంక్ అకౌంట్ హ్యాక్

- రూ.50వేలు డ్రా చేసిన సైబర్ మోసగాళ్లు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి గ్రామానికి చెందిన చల్ల ఆదిరెడ్డి అనే యువ రైతు మొబైల్ బ్యాంక్ ఖాతాను సైబర్ మోసగాళ్లు ఆదివారం హ్యాక్ చేశారు.ఓసారి రూ.25వేలు, మరో సారి రూ.25వేలు మొత్తం రూ.50వేలు బ్యాంక్ ఖాతా నుంచి డ్రా చేసుకున్నారు. ఈ విషయమై బాధితుడు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అల్ప్రాజోలం పట్టివేత

నిజామాబాద్‌రూరల్ : మండలంలోని ఓ గ్రామంలో నిషేధిత అల్ప్రాజోలంను పోలీసులు సీజ్ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై రూరల్ ఎస్‌హెచ్‌వో, ట్రెయినీ ఐపీఎస్ అధికారిణి చైతన్యరెడ్డిని వివరణ కోరగా.. వివరాలను మంగళవారం వెల్లడిస్తామని అన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: దోమకొండ మండలం అంబారీపేట గ్రామానికి చెందిన సింగం రేణుక అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆమె భర్త పరశురాములుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం రాత్రి 8 గంటలకు అడ్మిట్ చేశారు. ఆయన చికిత్స జరుగుతుండగానే 11 గంటల సమయంలో రేణుక ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. రేణుక ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మందర్నకు చెందిన వ్యక్తి..

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని మందర్న గ్రామానికి చెందిన పీరాజీ (40) అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. పీరాజీకి కొంతకాలంగా మతిస్థిమితం లేదని, ఈ ఏడాది జనవరి 19న ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆయన తిరిగిరాలేదన్నారు. కుటుంబ సభ్యులు అప్పటి నుంచి పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తిమ్మాపూర్‌లో చైన్ స్నాచింగ్

మోర్తాడ్(బాల్కొండ): మందుల కోసం మెడికల్‌కు వెళ్తున్న మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. మండలంలోని తిమ్మాపూర్‌లో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పల్లెపు గంగు అనే మహిళ తిమ్మాపూర్ బైపాస్ రోడ్డు మీదుగా ఇంటివైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను మాటల్లో దింపి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధిత మహిళ ఇంటికి వెళ్లి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. దుండగుల కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్, ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్‌రెడ్డి, మోర్తాడ్ ఏఎస్సై గోపాల్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాద్‌నగర్ కాలనీ(సారంగాపూర్)కి చెందిన మహ్మద్ అబ్దుల్ సలాం ఆదివారం చోరీ జరిగింది. సలాం ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి బయటకి వెళ్లి రాత్రి సమయంలో తిరిగి రాగా, దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని 20తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. సీసీ ఫుటేజీ పోలీసులు పరిశీలిస్తున్నారు.

బాన్సువాడలో ఆటో..

బాన్సువాడ : ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోను దుండగులు ఎత్తుకెళ్లినట్లు సీఐ కృష్ణ తెలిపారు. పట్టణంలోని పాత బాన్సువాడకు చెందిన నక్క రవి ఈ నెల 19న తన తమ్ముడైన నల్ల రాజశేఖర్ ఇంట్లో జరిగిన పంక్షన్‌కు వెళ్లాడు. రాత్రి అక్కడే ఆటోను పార్క్ చేసి తన ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం వచ్చి చూసే సరికి ఆటో కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బొలెరో పట్టివేత



రుద్రూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరోను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ సోమవారం తెలిపారు. మండలంలోని పోతంగల్‌లో ఆదివారం అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఇసుక అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నామన్నారు. చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు వాహనాన్ని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.


సారా విక్రేతల బైండోవర్



సిరికొండ: సారా విక్రయిస్తూ గతంలో పట్టుబడిన వారిని తహసీల్దార్ రవీందర్‌రావు ఎదుట ఎక్సైజ్ పోలీసులు సోమవారం బైండోవర్ చేశారు. ఎన్నికల సమయంలో వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు నాటు సారా విక్రయిస్తుండగా పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవరావు తెలిపారు. మరోమారు నాటు సారా విక్రయించొద్దని హెచ్చరిస్తూ వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ దత్తాద్రి, కానిస్టేబుల్ సుధీర్ ఉన్నారు.

భార్య కొడుతోందని..

బాన్సువాడ: తన భార్య నిత్యం కొడుతోందని ఓ భర్త ఆదివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి హల్‌చల్ చేశాడు. తాడ్కోల్ గ్రామ పంచాయితీ పరిధిలో గల రాజరాందుబ్బాకు చెందిన వ్యక్తి మద్యం సేవించి అర్ధనగ్నంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. రోజూ తన భార్య కొడుతోందని, తన భార్యపై కేసు నమోదు చేయాలని పోలీసులకు విన్నవించాడు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వ్యక్తి బాగా మద్యం సేవించి ఉన్నాడని, అతను మాట్లాడేది కూడా అర్థం కాకపోవడంతో నచ్చచెప్పి పంపించామని సీఐ కృష్ణ తెలిపారు.



అర్ధనగ్నంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వ్యక్తి